# అనుకోకుండా

స్వాతి కుమారి బండ్లమూడి



**మ్యూజింగ్:** అనుకోకుండా (9)

**రచన:** స్వాతి కుమారి బండ్లమూడి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: నవంబరు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=4165

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# అనుకోకుండా (9)

ఎప్పుడొచ్చావని అడిగిన ప్రతిసారీ, ఇంకా చేరుకోలేదనే చెప్తాను. నవ్వితే కళ్ళు విచ్చుకునే రోజుల్లో ఎప్పుడో నిద్రపోయి, దారుల మధ్య చూపు చీలిపోయిన చోట ఎక్కడో తప్పిపోయి, తగరపు కాగితాల పుస్తకం ఒకటి తెరిచి పెట్టుకుని, ఎవరికీ పంపని ఉత్తరాలు రాస్తూ ఇన్నాళ్ళూ ఆగిపోయానని, ఆపైన అలసిపోయాననీ అంటాను.

ఎలా నమ్మించాలో, ఏం చెప్పి ఒప్పించాలో ఎప్పుడూ కొత్తే. గడియారంలో ఇసుక జారిపోతుంది. ఇక త్వరపడాలి. వద్దనడం ఎలానో తెలుసుకోకముందే వదులుకోవడం నేర్చుకోవాలి.

తీరిక లేదు కాబట్టి దిగులూ లేదనే అనుకుంటాను. ఏ కష్టమూ లేకపోవడం తప్ప పెద్ద కష్టమేం లేదని కూడా ఒప్పుకుంటాను. వీల్లేదు కాబట్టి అవసరం లేదంటే సరేనంటాను.

అన్నీ అబద్ధాలే– అబద్ధాలతో సహా.

★

కోరుకోవడం ఒక్కటే నిజం. కలుసుకున్నదంతా కవిత్వమే. మునిగిపోయిన గులకరాయొకటి ఈదుకుంటూ ఒడ్డు చేరినప్పుడు ఉలికిపడకుండా, ఎవరూ చూడకుండా దాన్ని నీ చేతిలో పెట్టి దోసిలి మూసిన గుర్తు. ఇది తీసుకు వెళ్ళిపొమ్మని చెయ్యి వదిలినప్పుడు, పదే పదే అదేపనిగా వేళ్ళని ముద్దాడాలని గుర్తుకు రాకపోవడమూ గుర్తే.

అన్నీ గుర్తుంటాయి. ఒక్కసారైనా జరగని సంగతులే ఇంకా బాగా గుర్తొస్తాయి. ఎగిరిపోయిన పిట్టలు దూరం నుంచి మళ్ళీ మళ్ళీ అరుస్తాయి. బాహుశా అక్కడికి రావద్దని చెప్పడానికే పిలుస్తాయి. అది వినపడకూడదనేగా మనం ఏవో మాట్లాడుకుంటాం.

మాటలన్నీ ఐపోయాక, కలిసి నిద్రలేవడం గురించే చివరగా ఇంకోసారి చెప్పుకుంటాం. మన దేహాల్ని మనమే దూరంగా చూస్తూ మేల్కొనే కల వచ్చిన విషయం మాత్రం దాచేస్తాం. అదే కలలో ఒక ఆకుపచ్చ దుప్పటి మట్టి వేర్లతో మనమీద పరచుకోవడం చూసి ఇష్టంగా నవ్వుకుంటాం. పచ్చికపై రాలే పూలశబ్దాల కింద ఆదమరచి నిద్రపోతాం.

ఇక అప్పుడు మనం కలిసే ఉంటాం.

★

For Latest Telugu Books - Visit now:

Kinige .com